104

# గుండెలు మార్చబడును

- జంధ్యాల

## ఎపిసోడ్ - 1

డాక్టర్ మధు హాస్పిటల్‌లో 'ఇచ్చట గుండెలు మార్చబడును' అని బోర్డు తగిలిస్తుండగా వాళ్ళ మావయ్య గోవిందయ్యకి తాను ఏడుగురికి గుండె మార్పిడి ఆపరేషన్లు చేశానని అందులో ఆరుగురు మహాభేషుగ్గా వున్నారని చెప్తాడు. గోవిందయ్య తనకి వాంతులవుతున్నాయి అని చెబుతుండగా పెద్దదొరకి విరేచనం కాలేదని మందు ఇమ్మని మల్లు వస్తాడు. మందు తీసుకెళ్తాడు.

హాయిగా దగ్గు, పడిశానికి మందులిచ్చుకో ఈ గుండె మార్పిళ్లు చెయ్యడం ఏమీ బావుండలేదని ఓ సలహా చెప్పి గోవిందయ్య వెళ్లబోతూండగా రామచంద్రమూర్తి వయ్యారంగా హొయలు ఒలకబోస్తూ వస్తాడు. మధు 'రామచంద్రమూర్తిగారూ! అని పిలిస్తే' అయ్యో! నేను 'రమ'నండి. నిన్న గుండె ఆపరేషన్ జరిగిన దగ్గర్నించీ చాలా హాయిగా వుందని చెప్తాడు.

మళ్లీ మల్లు వచ్చి విరేచనం కాలేదని మందు తీసుకెళ్తాడు. రామ చంద్రమూర్తి తన పేరు 'రమ' అని చెప్పిందగ్గర్నించీ గోవిందయ్య రమ తనకే సొంతం అన్నట్టుగా ప్రవర్తిస్తుంటాడు.

కుక్కుటేశ్వరరావు అనే ఓ 50 యేళ్ల వ్యక్తి పాక్కుంటూ, డేక్కుంటూ చిన్నపిల్లవాడి చేష్టలు చేస్తూవుంటే రమ (రామచంద్రం) ఆపిల్లవాడ్ని సముదాయిస్తుంది. అది గోవిందయ్యకి నచ్చదు. ఓ చిన్నపిల్లవాడి గుండె ఈ పెద్దాయనకి పెట్టి ఆపరేషన్ చేసినట్టుగా గుర్తుకొస్తుంది మధుకి. కంగారుపడతాడు. కుక్కుటేశ్వరరావు ఏడుస్తుంటే మళ్లీ మీగుండె తెచ్చి మీకు ఆపరేషన్ చేస్తాను, ఊరుకోమంటాడు.

## ఎపిసోడ్ - 2

గోవిందయ్య గోల ఎక్కువైపోతుంది. తానో నవయువకుడిలా రమాదేవితో సరాగాలు, ముద్దుమాటలు ఎక్కువైతే అసలే చికాగ్గా వున్న మధు విసుక్కుంటాడు. మళ్లీ మల్లు దొరవిరేచనం మందు కోసం వస్తే మధు కిరసనాయిలు తీసుకొచ్చి మల్లుకిచ్చి మొత్తం తాగెయ్యమను మీదొరని అని చెప్తాడు.

పిల్లాడిని లోపల ఆడిస్తానని రమ కుక్కుటేశ్వరరావుని తీసుకొని లోపల కెడుతుంటే గోవిందయ్య కూడా వాళ్ళతో వెళ్తాడు. నరిసింహమూర్తి అనే ఆయన వచ్చి తన భార్య రమ అన్నీ మగాడి వేషాలు వేస్తోందనీ, సిగరెట్టు తాగడం, ఆడపిల్లల వంక చూడటం, గడ్డం చేసుకోవడం లాంటివి చేస్తోందని, నాపాంటూ, చొక్కా

వేసుకొని తయారయిందని ఏడ్చినంత పనిచేస్తాడు. విరుచుకుపడిపోతాడు. లోపల్నించి రమ వస్తూనే పడిపోయివున్న నరసింహమూర్తిని తన ఒళ్లోకి తీసుకొని నా భర్తని బ్రతికించండి డాక్టరుగారూ అని ఏడుస్తుంది.

వెనగ్గా వచ్చిన గోవిందయ్యకి ఈయనే నా భర్త అని చెప్తుంది. విషయం తెలిసిన గోవిందయ్య పరాయివాడి భార్య నాకు చెల్లెలు లాంటిదంటాడు. నరసింహమూర్తి రామచంద్రమూర్తిని చూసి నువ్వు నా భార్యవేమిటి అని కేకలేస్తాడు. మధు ఆపొరబాటు తన వల్లే జరిగిందని సరిచేస్తాను అంటాడు. రేపు సాయంకాలం లోపల ఏమైనా సరే మా ఆవిడ గుండె మా ఆవిడకి పెట్టకపోతేనా.. అని నరసింహమూర్తి బెదిరిస్తుంటే కోటేశ్వరరావు అనే ధనికుడు గుడ్డివాడిలా అడుక్కుంటూ వస్తాడు. గోవిందయ్య నరసింహ మూర్తికి ఆ కోటేశ్వరుడు అలా అడుక్కోవడం చూసి మధుని అడిగితే మధు ఆయనకు కూడా ఆపరేషన్ చేస్తానని చెప్తాడు.

తగుదునమ్మా అని ప్రతి వ్యవహారానికీ తయారవకూడదని మందలిస్తాడు నరసింహమూర్తి. రామచంద్రమూర్తి 'ఏవండీ' అంటూ రమలాగ నరసింహమూర్తి వెంటబడుతుంది. నరసింహమూర్తి వెంట రమ వెడుతుంటే చూసి కాస్త ఈ కుక్కుటేశ్వరరావుని కూడా ఇంట్లో దించమని రమ అడుగుతుంది. దాంతో విసుక్కున్న నరసింహమూర్తి మా పక్కింటి దేవయ్యగారి అబ్బాయికి ఆపరేషన్‌చేస్తే వాడేమో రెండేళ్ల వాడే ఐనా బూతుమాటలు మాట్లాడుతూ, చుట్టకాలుస్తున్నాట్ట. కాసేపాగితే నీ మీదకి రాగలడు జాగ్రత్త అని చెప్పి నరసింహమూర్తి వెళ్లిపోయాడు.

నిన్న ఆపరేషన్‌కి ముందు ట్రేలో పెట్టిన గుండెలన్నీ తారుమారు అయివుండాలి. అందుకే ఇంత విపరీతం జరిగిందని గోవిందయ్యతో చెప్పుకొని వాపోతాడు డాక్టర్ మధు.

మల్లు వచ్చి పెద్ద దొర యిహలేడు అని చెప్పి వెళ్లిపోతాడు. మధు తన వాంతులకిచ్చిన మాత్ర తిరిగి యిచ్చేస్తాడు గోవిందయ్య. గుండె ఆపరేషన్లు, మెదడు ఆపరేషన్లు లాంటి వాటి జోలికి పోకు అంటూ సలహా యిచ్చి వెళ్లబోతూ వెనక్కి వచ్చి నరసింహమూర్తి గారు చెప్పిన దేవయ్యగారి మనుషులనుకొంటా.. వస్తున్నార్రోయ్ అని చెప్తాడు.

మధు గుండెలు మార్చబడును అన్న బోర్డులో ఉన్న 'గుండెలు' అన్న మాటని 'గుండీలు' గా మార్చేస్తాడు.